PRGI NO:TGTEL/26/A6501




# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక:34 ఎడిటర్: రాపోలు లింగస్వామి 04-10 -2026 ఆదివారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00

## బ్రిటిష్ పాలనలోనూ సివిల్స్ పరీక్షలో సంస్కృతం పేపరు ఉండేది



న్యూఢిల్లీ: బ్రిటిష్ పాలనలోనూ సివిల్స్ సర్వీసెస్ పరీక్షలో సంస్కృతం ఒక పేపరుగా ఉండేదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. భారత్ మండపంలో జరిగిన యుపిఎస్‌సీ శతాబ్ది వేడుకల్లో ప్రధాని ప్రసంగిస్తూ, అక్కడ ఏర్పాటు చేసిన చారిత్రక ప్రదర్శనలోని ఓ అంశాన్ని ప్రస్తావించారు. స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 1920లో సివిల్స్ పరీక్షలో సంస్కృతం పేపరు రాశారని పేర్కొన్నారు. గ్యాలరీని పరిశీలిస్తున్నప్పుడు సుభాష్ చంద్రబోస్ కూడా ఇదే ప్రక్రియలో ఎలా పాల్గొన్నారో తెలిపే సమాచారం అందులో ఉన్నట్టు గమనించానని చెప్పారు. అప్పట్లో భారత్ బ్రిటిష్ పాలనలో ఉన్నప్పటికీ పరీక్షలో సంస్కృతం పేపరు ఉండటం తనకు ప్రత్యేకంగా ఆసక్తి కలిగించిందన్నారు. సుభాష్ బాబు ఈ పేపరు రాశారని చెప్పారు. నేతాజీ, ఇతర చారిత్రక ప్రముఖుల సేవలను ప్రధాని ప్రశంసించారు. గత వందేళ్లలో ఎంతో మంది వ్యక్తులు పరీక్ష ప్రక్రియను విశ్వాసానికి ప్రతీకగా మార్చి, యుపిఎస్‌సి సంస్థను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. భారత సివిల్ సర్వీసెస్ వ్యవస్థ సాగించిన సుదీర్ఘ చారిత్రక ప్రయాణాన్ని అర్థం చేసుకుని యువతో పాటు పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా ఈ గ్యాలరీని సందర్శించాలని కోరారు. యుపిఎస్‌సి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్మారక నాణేన్ని, తపాలా బిళ్లను ప్రధాని విడుదల చేశారు. భారతదేశంలోని పబ్లిక్ సర్వీస్ కమిషన్లను ప్రభావితం చేసిన కీలక నిర్ణయాలను వివరిస్తూ రూపొందించిన పుస్తకాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు.

## విద్యా, వైద్యంపై జిల్లాల వారీగా ప్రతి వారం సమీక్షించాలి

**: సీఎం రేవంత్‌రెడ్డి**




హైదరాబాద్, అక్టోబరు3: విద్యా, వైద్యంపై జిల్లాల వారీగా అధికారులు ప్రతి వారం సమీక్షించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిఆదేశించారు. రాష్ట్రంలో విద్యా, వైద్యంపై సీఎంవో అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశంచేశారు. నిర్మాణంలోని ప్రధాన ఆస్పత్రులపై సీఎం ఆరా తీశారు. ఎల్బీనగర్,అల్వాల్, వరంగల్,ఉస్మానియా ఆస్పత్రుల పనుల్లో వేగంపెంచాలని ఆదేశించారు. ఆస్పత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికిసిబ్బందినియామకాలు పూర్తి చేయాలని మార్గనిర్దేశం చేశారు.

**ఆస్పత్రులనూ క్షేత్రస్థాయిలో పరిశీలించాలి..**

వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను ముందుగానే గుర్తించాలని సీఎం సూచించారు. అత్యాధునిక వైద్య పరికరాల కొనుగోలును వేగవంతం చేయాలని నిర్దేశించారు. ఆయా ఆస్పత్రులు పూర్తయ్యే నాటికి అన్ని వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లను అధికారులు తప్పనిసరిగా సందర్శించాలని ఆదేశించారు. జిల్లాల్లోని ఆస్పత్రులనూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు.

**డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్..**

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు. అవసరమైన చోట ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టాలని సూచించారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడులపై పకడ్బందీ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి

**: కూనంనేని**



హైదరాబాద్: ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ప్రజా వ్యతిరేకతను వాడుకోవడంలో విపక్షాలు విఫలం అని అన్నారు. ఖమ్మంలోని సాంబశివరావు రేవంత్ సర్కార్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. తన నియోజకవర్గంలో పోటీ చేసేందుకు ఓ మంత్రి పావులు కదుపుతున్నారని, విద్యారంగంపై సిఎం రేవంత్ రెడ్డి దృష్టిసారిస్తున్నా..అది హైదరాబాద్ కే పరిమితమవుతోందని విమర్శించారు. పొత్తులో తమరు వారికి ఇచ్చింది ఒక్క సీటని, తాము కాంగ్రెస్ కు ఇచ్చింది ఎన్నో అని తెలియజేశారు. పొత్తు ఉన్నప్పుడు కొత్తగూడెం సీటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఎందుకు వర్తిస్తుంది? అని కూనంనేని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ, సంక్షేమ పథకాల అమలులో..అర్హులకు పూర్తిస్థాయిలో లబ్ధి చేకూరలేదని, ఉన్న బడ్జెట్ ను కూడా సక్రమంగా ఖర్చు పెట్టలేకపోతున్నారని సాంబశివరావు ఎద్దేవా చేశారు.

## డాక్టర్ షేక్ నయీమ్‌కు లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అవార్డు

### సామాజిక సేవలకు గుర్తింపుగా పురస్కారం




హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం,అక్టోబర్ 3: తెలంగాణకు చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ షేక్ నయీమ్‌కు సామాజిక సేవా రంగంలో చేసిన కృషికి లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్?సోషల్ వర్క్ అవార్డు లభించింది. దివ్యాంగులు, అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం ముఖ్యంగా తెలంగాణలో ఆయన అందిస్తున్న సేవలను



గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేసినట్లు అవార్డు ధ్రువీకరణ పత్రంలో పేర్కొన్నారు.సామాజిక సేవా రంగంలో ఆయన చేసిన విశేష కృషి, అంకితభావం, నిరంతర సేవలను అవార్డు సంస్థ గుర్తించింది. సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, దివ్యాంగుల సంక్షేమానికి ఆయన చేస్తున్న సేవలు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ధ్రువీకరణ పత్రంలో పేర్కొన్నారు.డాక్టర్ షేక్ నయీమ్‌కు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో 100 సోషల్ వర్క్ అవార్డులు లభించినట్లు ధ్రువీకరణ పత్రంలో పేర్కొన్నారు. సమ్మిళిత సమాజ నిర్మాణానికి ఆయన చేస్తున్న కృషి, నాయకత్వం, నిస్వార్థ సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని అందించినట్లు తెలిపారు.

## ఆలయాల భద్రతపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి

**దిల్‌సుఖ్‌నగర్ సంతోషీమాత ఆలయ ఘటనపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆగ్రహం**



హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం,అక్టోబర్: 03: దిల్‌సుఖ్‌నగర్‌లోని ప్రసిద్ధ సంతోషీమాత ఆలయంలో అమ్మవారి విగ్రహంపై దాడి జరిగిన ఘటనపై ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటన విషయం తెలుసుకున్న ఆయన ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయంలోకి ఓ వ్యక్తి ప్రవేశించి అమ్మవారి విగ్రహంపై దాడికి పాల్పడిన ఘటన సీసీ కెమెరాల్లో నమోదైనట్లు తెలిపారు. ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, దాడికి గల కారణాలను వెలికితీయాలని కోరారు. హైదరాబాద్‌లో గతంలో ముత్యాలమ్మ, చిట్టిముత్యాలమ్మ తదితర ఆలయాల్లోనూ ఘటనలు చోటుచేసుకున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. వరుస ఘటనల నేపథ్యంలో ఆలయాల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకించి అమ్మవారి ఆలయాల వద్ద భద్రతను పెంచాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. సంతోషీమాత ఆలయ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను దర్యాప్తులో వెలికితీసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ముద్ద కళ్యాణ్, చంద్రశేఖర్ ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

## అనంతగిరి బస్సు ప్రమాదంపై కేటీఆర్‌గ్భ్రాంతి..

**బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచన**



వికారాబాద్ జిల్లా అనంతగిరి సమీపంలో జరిగిన బస్సు ప్రమాద ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌గ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం తనను తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడం, పలువురు గాయపడటం బాధాకరమని కేటీఆర్ అన్నారు. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులను వెంటనే రక్షించి, అవసరమైన వైద్య సహాయం అందించేందుకు సహాయక చర్యల్లో పాల్గొనాలని స్థానిక బీఆర్ఎస్ నాయకత్వానికి సూచించానని తెలిపారు. ప్రమాదంలో చిక్కుకున్న వారికి అవసరమైన సహాయం అందేలా స్థానిక నాయకులు అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు.

# సంపాదకీయం

## జన జాతరలో ఘన గీతం

పల్లె వాడకట్టు నుంచి పట్నంలోని దాటి ట్యాంక్‌బండ్ వరకు.. ఈ సారి వినాయక నవరాత్రుల్లో ఒక ఆసక్తికరమైన సాంస్కృతిక దృశ్యం కనిపించింది. మండపంలో గణనాయకుడు.. మది నిండా జననాయకుడు అన్నట్టుగా ఉత్సవాలు సాగాయి. మంత్రోచ్ఛారణల మధ్య పూజలందుకున్న వినాయకుడి మండపమే కేసీఆర్ గీతాలకు వేదికైంది. డప్పు దరువుకు పల్లె జనం కాలు కదిపింద్రు.. పెద్దలు వంత పాడింద్రు.. యువత గొంతు కలిపింది. నిన్నటి రాజకీయ ప్రచార గీతం.. నేటి పండుగ సంబురంలో భాగం అయింది. ఇది కేవలం రాజకీయ ప్రచారమా? లేక తెలంగాణ సామూహిక జ్ఞాపకంలో సజీవంగా ఉన్న అనుభవమా? తెలంగాణలో పండుగలంటే కేవలం పూజల తంతు మాత్రమే కాదు. బతుకమ్మైనా.. బోనాలైనా.. వినాయక నవరాత్రులైనా.. రేపటి దుర్గోత్సవాలైనా ఊరంతా ఒక్కచోట చేరి గుండె గొంతుకను వినిపించే సాంస్కృతిక కల్లం. కులాల పొలిమేరలు కాసేపు పలుచబడే చోటు. బతుకు బాధలను.. దాంట్లోనే కాసింత మురిపాన్ని.. జీవిత కాల రందిని పంచుకునే సామూహిక వేదిక. చేలల్లో రైతు.. ఆటో నడుపుకునే యువకుడు.. సద్ది మూటగట్టుకునిపోయే కూలీ, చదువులకు పోయే విద్యార్థి.. సడుగులుడికి గడప పట్టుకుని కూర్చున్న ముసలవ్వ.. అందరూ ఒక్కచోట కలిసే సామాజిక కేంద్రం. అలాంటి నిఖార్సయిన వేదిక మీద మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేరు గీతమై మోగినప్పుడు.. చిన్నాపెద్ద కాలు కదిపినప్పుడు.. వృద్ధులు గొంతు కలిపి పాడినప్పుడు.. రాజకీయ విరోధులు సైతం ఆ క్షణంలో విభేదాలు పక్కనపెట్టి చప్పట్లు కొట్టినప్పుడు.. అదొక సామాజిక-సాంస్కృతిక దృగ్విషయం. దీన్నంతటినీ కేవలం రాజకీయ కోణంలోనే చూడటం అంటే.. వాస్తవిక అంతరార్థాన్ని విస్మరించడమే అవుతుంది. పాటతో పోరాటాన్ని పలికించి.. డప్పు దరువుతో ఉద్యమాన్ని ఉర్రూతలూగించి.. పాటలనే ఆయుధాలుగా మలిచి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్న గడ్డ ఇది. ఇక్కడ రాజకీయం కూడా పాటల బాణీల్లోనే పలుకుతుంది. అందుకే గతంలో ఎన్నికల ప్రచారంలో మార్మోగిన కేసీఆర్ పాటలు.. వర్తమానంలో కేసీఆర్ పాలనను గుర్తుచేసే గీతాలుగా మళ్లీ వినిపిస్తున్నయి. ప్రజలు గతాన్ని జ్ఞాపకంగా మాత్రమే మోసుకుపోరు. తాము అనుభవించిన నిన్నటిని.. తమ కండ్ల ముందున్న ఈనాటిని తూకం వేసుకుంటరు. తూకంలో తేడా ఎంత వస్తే.. గతం అంత గాఢమైన జ్ఞాపకంగా మారుతుంది. వ్యవసాయమే జీవనాధారమైన ఈ నేలకు రైతుబంధు ఒర చేయూత. కేసీఆర్ సర్కార్ తొలుత ఎకరాకు రూ.4 వేలతో మొదలుపెట్టి.. 2019-20 నుంచి ఎకరాకు సీజన్‌కు రూ.5 వేలకు పెంచింది. అంటే ఏడాదికి ఎకరాకు రూ.10 వేలు. విత్తనం కొనుకునే వేళ రైతు చేతికి అందిన పైస.. ఎరువుల బస్తా కోసం తోడుగా నిలిచిన సాయం. రూ.73 వేల కోట్లు పల్లె ఆర్థిక వ్యవస్థలోకి ప్రవహించిన వాస్తవం. అదే జ్ఞాపకం పేదింటి ఆడబిడ్డ పెండ్లి ముంగిట కనిపించింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు పుష్కకాలం నిండింది. 2018లో రూ.75,116 నుంచి రూ.1,00,116కు పెంచింద్రు. పేద తల్లిదండ్రులకు ఆదరువుగా నిలిచింది. నెల మొదటి తేదీ కోసం ఎదురు చూసే అవ్వాతాతల జీవితంలో ఆసరా మరో జ్ఞాపకం. ఉమ్మడి రాష్ట్రంలో రూ.200గా ఉన్న వృద్ధాప్య పింఛన్? తెలంగాణలో రూ.1,000కు పెరిగింది. దివ్యాంగుల పింఛన్ రూ.500 నుంచి రూ.1,500కు పెరిగింది. ఆ తర్వాత వృద్ధులు, వితంతువులకు రూ.2,016.. దివ్యాంగులకు రూ.3,016గా పెరిగిన మొత్తాలు పింఛన్ అనే పదానికి కొత్త అర్థాన్ని ఇచ్చినయి. అవ్వాతాతలకు మందు గోళీలు కొనుక్కునే స్వేచ్ఛ.. మనవడికి చిల్లర ఇచ్చిన మురిపెం.. ఇంట్లో తన మాటకు ఇంకా విలువ ఉన్నదనే ఆత్మవిశ్వాసాన్ని నింపిన జ్ఞాపకం.చెరువు.. చేను.. బిందె.. రైతు ఈ నాలుగు తెలంగాణ గుండె చప్పుళ్లు. ఐదేండ్లలో 46,300 చెరువులను పునరుద్ధరించాలన్న మిషన్ కాకతీయ సంకల్పం పంట పొలాలకు పసరు పోసింది. 'మిషన్ భగీరథ' ఆడబిడ్డలు భుజాలపై తరతరాలుగా మోసిన బిందె బరువును దించింది. 54లక్షలకు పైగానివాసాలకుగోదావరి, కృష్ణా జలాలను నల్లాల ద్వారా అందించింది. తొలిపొద్దుతోనే బిందె పట్టుకుని బయలుదేరే ఆడబిడ్డలకు.. దూరపు బావుల దగ్గర పడిగాపులు కాసే తల్లులకు ఊరట దొరికింది. తరతరాల నీటి గోసకు దొరికిన ఉపశమనంగా మిగిలింది. అరవై ఏండ్ల కరువుకు కాళేశ్వరం ఒక సమాధానం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు, భారీ పంపుహౌస్‌లతో గోదావరి నీటిని ఎదురెకించి దాదాపు 1,600 కిలోమీటర్ల కాలువల గుండా మళ్లించిన తీరు సామాన్యుడిని ఆశ్చర్యపరిచింది. తెలంగాణ సాగునీటి చర్చలో ఒక పెద్ద అధ్యాయంగా నిలిచింది.వాన కోసం ఆకాశం వైపు చూసిన నేల.. పంట నూర్పిళ్ల వేళ ధాన్యపు రాశులతో కళకళలాడింది. తెలంగాణ ఏర్పడే నాటికి దాదాపు 35 లక్షల టన్నులుగా ఉన్న ధాన్యం దిగుబడి.. ఆ తర్వాత ఏటా దాదాపు 1.5 కోట్ల నుంచి 2 కోట్ల టన్నుల స్థాయికి చేరింది. అప్పటి నుంచే రైతు జ్ఞాపకంలో కాలువలో నీరు.. నిండిన చెరువు.. పచ్చని పంట అనే దృశ్యాలు ఒక జ్ఞాపకంగా ఉన్నయి. వర్తమానంలో వర్షాల లోటు, నీటి సమస్యలు, వ్యవసాయ పరిస్థితులపై గ్రామాల్లో వినిపిస్తున్న ఆవేదన. ఆనాడు ఎంతటి ఎండకాలమైనా చెరువులు మత్తళ్లు దుంకినయి.. కాల్వల పొంటి నీళ్లు గలగల పారినయి. ఆ నీళ్లకు ఇప్పుడేమైంది? అనే ప్రశ్న రచ్చబండ దగ్గర వినిపించినప్పుడు.. అది కేవలం గతాన్ని పొగిడే మాట కాదు. నిన్నటి అనుభవాన్ని నేటి పరిస్థితితో పోల్చుకునే సామాజిక మనస్తత్వం.ఇంతటి పరిణామంలో అత్యంత కీలకమైన అంశం యువతరంలో కనిపిస్తున్న స్పందన.

# ఒంటరితనం



ఒంటరి మనిషి కన్నీటి భాషను ఎవరు చదవగలరు,
మౌనంలో దాగిన గాయాల గాథను ఎవరు వినగలరు,
చెప్పినా తన బాధకు అర్థం ఎవరు ఇవ్వగలరు,
చెప్పలేని ఆ వేదనను ఒంటరితనమే గ్రహించగలదు.
జనం మధ్య నిలిచినా మనసు ఖాళీ గదిలా మారుతుంది,
నవ్వుల మధ్య నడిచినా లోపల నిశ్శబ్దం పేరుకుపోతుంది,
చుట్టూ బంధాలున్నా తనవాళ్లు లేరనే నిజం గుచ్చుతుంది,
వెయ్యి చేతుల మధ్యా ఒంటరి హృదయం వణుకుతుంది.
కన్నీరు జారితే కారణం అడిగేవారు చాలామంది,
కానీ కన్నీటి వెనుక కథను మోసేవారు కొద్దిమంది,
నొప్పిని చెప్పడానికి మాటలు వెతికేలోపే రాత్రవుతుంది,
మాట దొరకని చోట మౌనమే తోడవుతుంది.
ఒంటరితనం అంటే జనాలకు దూరంగా ఉండటం కాదు,
మనసును అర్థం చేసుకునే మనిషి లేకపోవడమే అది,
పక్కనే ఉన్నా పలకరించని దూరమే దాని గాయం,
మనసు పిలిచినా వినిపించని శూన్యమే దాని ఛాయం.
రాత్రి నిద్రపోయే ముందు జ్ఞాపకాలు తలుపు తడతాయి,
దాచిన బాధలన్నీ నిశ్శబ్దంగా బయటకొస్తాయి,
దిండు మాత్రమే కన్నీటి రహస్యాలకు సాక్షమవుతుంది,
ఉదయం మాత్రం ఏమీ జరగనట్టే ముఖం నవ్వుతుంది.
తన ఒంటరితనాన్ని తానే మోస్తూ మనిషి నడుస్తాడు,
తన గుండె పగుళ్లను తానే కుట్టుకుంటూ బ్రతుకుతాడు,
ఎవరూ అర్థం చేసుకోలేని ఆ మౌనమే అతని తోడు,
అతని బాధకు అతనికే తెలుసు అసలైన ఆరాధన,
ఆడు.
ఒంటరితనం శాపమైతే మౌనం దాని నీడ,
జ్ఞాపకాలే దాని గోడలు, కన్నీళ్లే దాని నది,
ఎవరికీ అర్థం కాని ఆ అంతరంగపు గాథ,
మనసుకే మాత్రమే తెలిసే పేరు ఒంటరితనం.
రచన : ఆర్.కె.రెడ్డిగోగులపల్లి, నెల్లూరు జిల్లా.

## ఆశకు స్థోమత ? ఆశయానికి సామర్థ్యం



ఆశకు హద్దులు ఉండాలని అందరూ అంటారు,
ఆశలేని బతుకులను మాత్రం ఎవరు కోరరు.
ఆశ ఉంటేనే అడుగులకు అర్థం ఉంటుంది,
ఆశయం ఉంటేనే జీవితానికి గమ్యం ఉంటుంది.
ఆకాశాన్ని కోరడం తప్పేమీ కాదు,
అందుకోవాలంటే రెక్కలు పెంచుకోవాలి కదా!
కలలు కనడం తప్పేమీ కాదు,
కలలను గెలిపించే కష్టం ఉండాలి కదా!
ఆశకు హద్దు కాదు స్థోమత కావాలి,
ఆశయానికి మాట కాదు సామర్థ్యం కావాలి.
కోరిక ఎంత ఎత్తులో ఉన్నా పరవాలేదు,
కృషి అంత లోతుగా ఉంటే చాలు.
గమ్యం ఎంత దూరమైనా భయం వద్దు,
గమనంలో అడుగులు ఆగకూడదు.
ఎదురుగాలి ఎంత గట్టిగా వీచినా సరే,
ఎదిగే సంకల్పం వాలకూడదు.
కలల కొలతను కాలం నిర్ణయించదు,
కలలను నిజం చేసే శ్రమే నిర్ణయిస్తుంది.
ఆశను అడ్డుకునేది పరిస్థితి కాదు,
ఆశయానికి తగ్గ శక్తి లేకపోవడమే అవరోధం.
చేతిలో శ్రమ ఉంటే దారి పుడుతుంది,
చిత్తంలో ధైర్యం ఉంటే గెలుపు నడుస్తుంది.
ఆశను ఆయుధంగా మలచుకో,
ఆశయాన్ని ఆచరణగా మార్చుకో.
హద్దులు వేసిన ఆశ చిన్నదైపోతుంది,
స్థోమత పెంచిన ఆశ శిఖరమై నిలుస్తుంది.
కల కన్న కళ్లకు నిద్ర సరిపోదు,
కల నెరవేర్చే చేతులకు విశ్రాంతి సరిపోదు.
అందుకే ఆశను తగ్గించకు శక్తిని పెంచుకో,
ఆశయాన్ని మార్చకు సామర్థ్యాన్ని పెంచుకో.
నీ స్థోమతే నీ ఆశకు రెక్కలవుతుంది,
నీ సామర్థ్యమే నీ ఆశయానికి విజయమవుతుంది.
రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.
చరవాణి : 9866179385

# మహిళ అదృశ్యం



హైదరాబాద్,జ్యోతి ప్రభంజనం,అక్టోబర్ 03: చత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో 37 ఏళ్ల మహిళ అదృశ్యమైంది. శివసాయినగర్, ఉప్పుగూడకు చెందిన ఎ. పూజ (37) ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆమె భర్త ఎ. పర్వత్. ఈ నెల 26న రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన పూజ తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తల్లి కె. ప్రమీల గత నెల 29న చత్రినాక పోలీసులకు ఫిర్యాదు చేశారు.పూజ 5.5 అడుగుల ఎత్తు, మధ్యస్థ శరీరాకృతి, ఓవల్ ఆకారపు ముఖం, మధ్యస్థ ఛాయ కలిగి ఉంటారని పోలీసులు తెలిపారు. అదృశ్యమైన సమయంలో నీలం రంగు చీర ధరించి ఉన్నారు. తెలుగు, హిందీ, కన్నడ భాషలు మాట్లాడగలరు. ఈ మేరకు చత్రినాక పోలీసులు క్రైమ్ నంబర్ 533/2026 కింద మహిళ అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.పూజ ఆచూకీ తెలిసిన వారు 8712661293, 040-27854788 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## నవ సాధికార కేంద్రంలో చెక్కుల పంపిణీ



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):పాల్వంచ నవ లిమిటెడ్ సామాజిక కార్యక్రమాలలో భాగంగా ఏర్పాటు చేసిన నవ మహిళా సాధికార కేంద్రంలో తాటి ఆకుల కళాకృతులు విక్రయించడం ద్వారా వచ్చిన రూ.2,58,470 నగదు, యూనిఫామ్స్ కుట్టడం ద్వారా వచ్చిన రూ.1,01,655 నగదు మొత్తం రూ.3,60,125ను ప్రమోటర్ రమా దేవినేని చెక్కులను చేతి వృత్తుల కళాకారులకు శనివారం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రమా దేవినేని మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుడాలని ఆ కుటుంబం ఎప్పుడూ ఆనందమయంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అముద, స్వరూపరాణి, అరుణ, బి.అరుణ, శిరీష, దివ్య, కవిత విద్యార్థులు పాల్గొన్నారు.

## కెప్టెన్ స్మిత్ మచ్చార్ కు శ్రీ రాగా స్కూల్ అభినందనలు

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):ప్రమాదకర పరిస్థితుల్లో



అపారమైన ధైర్యసాహసాలు ప్రదర్శించి ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్ సేవలను కొనియాడుతూ శ్రీ రాగా ప్లే అండ్ హై స్కూల్‌లో శనివారం ప్రత్యేక అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రాగా స్కూల్ కరస్పాండెంట్ మల్లారపు వర ప్రసాద్ మాట్లాడుతూ ఆపద సమయంలో కెప్టెన్ స్మిత్ మచ్చార్ చూపిన ధైర్యం సమయస్ఫూర్తి కర్తవ్యనిబద్ధత విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. శ్రీ రాగా డైరెక్టర్ మల్లారపు కవిత మాట్లాడుతూ మానవ ప్రాణాలను కాపాడేందుకు స్మిత్ మచ్చార్ ప్రదర్శించిన సాహసం యువతకు ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాంబాబు, మహా లక్ష్మీ, చరిత శ్రీ, స్వాతి, అఖిల రామ్ కృష్ణ విద్యార్థులు పాల్గొని కెప్టెన్ స్మిత్ మచ్చార్‌కు ఘనంగా అభినందనలు తెలిపారు.

## ఓబీసీ సింహగర్జన సభకు ఏర్పాట్లు



గొల్లపల్లిలో నేడు సభశంషాబాద్, జ్యోతి ప్రభంజనం,అక్టోబర్ 3 :రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం గొల్లపల్లిలో ఆదివారం 'ఓబీసీ సింహగర్జన' మహాసభ నిర్వహించనున్నట్లు రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తెలిపారు. పీసీసీ ఓబీసీ ఛైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఈ సభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఓబీసీల హక్కులు, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో తగిన ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం తదితర అంశాలపై సభలో చర్చించనున్నట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఏఐసీసీ ఓబీసీ ఛైర్మన్ డా. అనిల్ జైహింద్ యాదవ్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఏఐపీసీ చైర్మన్ మధు యాస్కీగౌడ్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఏఐసీసీ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కోఆర్డినేటర్ కొప్పుల రాజు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర, జిల్లా స్థాయి కాంగ్రెస్ నాయకులు పాల్గొననున్నట్లు పారిజాత నర్సింహారెడ్డి వెల్లడించారు. సభకు ఓబీసీ వర్గాల ప్రతినిధులు, యువత, మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు తెలిపారు.

# ఆర్టీఐ చట్టం అమలుకు మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలి

**ఆర్‌టీఐ కార్యకర్తలను సభ్యులుగా నియమించాలి**

**ప్రభుత్వానికి ఆర్‌టీఐ రక్షక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు లింగస్వామి విజ్ఞప్తి**



హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం,అక్టోబర్ 0 3:సమాచార హక్కు చట్టం-2005 అమలును మరింత పటిష్ఠం చేసి, ప్రజలకు చట్టంపై విస్తృత అవగాహన కల్పించేందుకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆర్‌టీఐ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని సీనియర్ జర్నలిస్ట్ ఆర్‌టీఐ రక్షక్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు లింగస్వామి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి రెండు దశాబ్దాలు పూర్తయినప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు చట్టంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంలో ఆర్టీఐ చట్టం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది ఆర్టీఐ కార్యకర్తలు స్వచ్ఛందంగా పనిచేస్తున్నారని తెలిపారు. వారి సేవలను గుర్తించి జిల్లాల వారీగా ఏర్పాటు చేసే మానిటరింగ్ కమిటీల్లో ఆర్టీఐ కార్యకర్తలను సభ్యులుగా నియమిస్తే, క్షేత్రస్థాయిలో చట్టంపై అవగాహన మరింత విస్తృతం చేయవచ్చన్నారు. అలాగే గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి అధికారులు, ప్రజలకు సమాచార హక్కు చట్టంపై సమగ్ర అవగాహన కల్పించాలని కోరారు. చట్టంలోని నిబంధనలు పకడ్బందీగా అమలయ్యేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని రాపోలు లింగస్వామి విజ్ఞప్తి చేశారు.

# మానసిక ప్రశాంతతతోనే.. ఒత్తిడిని అధిగమించగలం

**ది అన్‌చార్టెడ్ ఆర్టరీ పుస్తకావిష్కరణలో బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి**

**రచయిత డాక్టర్ శరత్ రెడ్డిని అభినందనలు తెలిపిన కీర్తిరెడ్డి**

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, అక్టోబర్ 03:ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళనలను అధిగమించాలంటే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మెడికవర్ ఆస్పత్రిలోని బ్లూ ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ శరత్ రెడ్డి రచించిన ది అన్‌చార్టెడ్ ఆర్టరీ' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీ రమేష్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, బీజేపీ సీనియర్ నాయకులు డోకూరి పవన్ కుమార్ రెడ్డి, ప్రముఖ సినీనటుడు రాజా రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ ది అన్‌చార్టెడ్ ఆర్టరీ పుస్తకం డాక్టర్ శరత్ రెడ్డి ఆలోచనా విధానానికి నిదర్శనం అన్నారు. శారీరక ఆరోగ్యంపై



అవగాహనతో అంతర్గత ప్రశాంతత, మానసిక సమతుల్యత వైపు ప్రజలను నడిపించే ప్రయత్నం ఈ పుస్తకంలో కనిపిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో వేగవంతమైన జీవనశైలి కారణంగా ఒత్తిడి ఆందోళనలు పెరుగుతున్నాయన్నారు.

# డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్ తోటలను సాగుచేయాలి

**జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగయ్య**



జ్యోతి ప్రభంజనం, నేరడుచర్ల, ప్రతినిధి,అక్టోబర్ 03: ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న అయిల్ పామ్ తోటలను సాగు చేసినట్లు అయితే రైతులు ఆర్థికనీగా అభివృద్ధి చెందవచ్చు అని జిల్లా ఉద్యాన శాఖ అధికారి టి నాగయ్య అన్నారు మండల పరిధిలో నీ ఫేతేపురం గ్రామం లో తాటికొండ నారాయణమ్మ 10 ఎకరాలలో నూతనంగా సాగు చేస్తున్నటువంటి ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమంను అయన ప్రారంభించారు. సందర్బంగా వారు మాట్లాడుతూ మార్కెట్లో డిమాండ్ ఉన్న అయిల్ పామ్ తోటలను సాగు చేసి రైతులు ఆర్థికనీగా అభివృద్ధి చెందవచ్చు అని తెలిపారు..ఆయిల్ పామ్ తోటనాటిన నాలుగవ సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమవుతుంది అని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం బిందు సేద్యం, ఎరువులకి, అంతర పంటలకు రాయితీలు ఇస్తుందన్నారు. ఎరువులు మరియు అంతర పంటల యాజమాన్యానికి ఒక ఎకరానికి రూపాయలు 4200/- చొప్పున మొదటి నాలుగు సంవత్సరాలు ప్రోత్సాహకం ఇవ్వబడును. గరిష్టంగా ఒక రైతుకు 12:50 ఎకరాల వరకు డ్రిప్పు రాయితీ వర్తిస్తుందనీ నమ్మకమైన నీటి వసతి గల రైతులు లాభదాయకమైన ఆయిల్ పామ్ పంటను సాగు చేసి, అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. ఒక ఎకరానికి దిగుబడి పది టన్నుల వరకు వస్తుందనీ మొదటి నాలుగు సంవత్సరాల వరకు అంతర పంటలుగా ప్రస్తుతం మార్కెట్లో బాగా డిమాండ్ ఉన్న కూరగాయలను, వాణిజ్య పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు.. ఆయిల్ పామ్ తోటలు సాగు చేయాలనుకున్న, ఆసక్తి గల రైతులు ఉద్యాన శాఖ అధికారులకు దరఖాస్తు చేయలని కోరారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఉద్యాన అధికారిని ఎల్ ప్రదీప్తి మున్సిపల్ కమిషనర్ వెంకట్ రెడ్డి, సర్పంచ్ సురేష్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ మేనేజర్ అలీమ్ తహసీల్దార్ సైదులు,మండల వ్యవసాయ అధికారి జావీద్,ఆయిల్ పామ్ సిబ్బంది రైతు లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రుల పరిస్థితిపై కవిత ఆగ్రహం

**భూపాలపల్లి ఆస్పత్రిలో సీలింగ్ కూలిన ఘటనపై స్పందన**

**ప్రభుత్వ ఆస్పత్రులపై ఆపరేషన్ బ్లూకోడ్' నిర్వహిస్తాం**

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం,అక్టోబర్ 3: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, వైద్య సేవల పరిస్థితిపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూలో సీలింగ్ కూలిన ఘటనపై ఆమె 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో అగ్ని ప్రమాదంలో ఐదుగురు చిన్నారులు మృతి చెందిన ఘటన మరువకముందే భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో సీలింగ్ కూలడం ఆందోళన కలిగిస్తోందని కవిత పేర్కొన్నారు. సీలింగ్ కూలిన సమయంలో వార్డులో చిన్నారులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, మందులు, బెడ్ల కొరత వంటి సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల పరిస్థితులను ప్రజల ముందుకు తీసుకువచ్చేందుకు త్వరలో ఆపరేషన్ బ్లూకోడ్' పేరుతో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శించనున్నట్లు కవిత తెలిపారు. ఆస్పత్రుల్లోని వాస్తవ పరిస్థితులను పరిశీలించి ప్రజల దృష్టికి తీసుకువస్తామని వెల్లడించారు. బస్సు ప్రమాద మృతుల కుటుంబాలను ఆదుకోవాలివి కారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రైవేటు బస్సు బోల్తాపడి ముగ్గురు మృతి చెందిన ఘటనపై కవిత విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని, మృతుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

# ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు.

**అభివృద్ధికి మరింత తోడ్పాటు**



జ్యోతి ప్రభంజనం,దుండిగల్,ప్రతినిధి, అక్టోబర్ 3: సీఎంసీ దుండిగల్ సర్కిల్ పరిధి భౌరంపేట్ లక్ష్మీ నగర్ కాలనీలో విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించేందుకు నూతనంగా నాలుగు నాలుగు ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయగా, మాజీ కౌన్సిలర్ మురళీ యాదవ్ ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన ట్రాన్స్ఫార్మర్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ విచ్చేసి ట్రాన్స్ఫార్మర్లను ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ద్వారా అభివృద్ధికి మరింత తోడ్పాటు లభిస్తుందని, గత 12 ఏళ్ల కాలంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పాటు దుండిగల్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ ప్రసూన, పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, ధర్మా రెడ్డి, కాలనీ వాసులు తిరుపతి రెడ్డి, దిలీప్, సూరిబాబు, శ్రీనివాస్ రెడ్డి, చారి తదితరులు పాల్గొన్నారు.

# అనంతగిరి ప్రమాదంపై సునీతారెడ్డిగ్భ్రాంతి



వికారాబాద్ , జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 03:అనంతగిరి ఘాట్ రోడ్డులో శనివారం ప్రైవేటు బస్సు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో నలుగురు మృతి చెందడంపై జడ్పీ మాజీ చైర్‌పర్సన్, మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జీ పట్నం సునీతా మహేందర్‌రెడ్డి తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వార్త తెలిసి తాను తీవ్రంగా కలత చెందినట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ఇప్పటికే సహాయక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాద ఘటనపై అధికారులు సమగ్రంగా స్పందించి, బాధితులకు అవసరమైన సహాయం అందించాలని ఆమె సూచించారు.

# సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో మున్సిపల్ కార్మికులకు జిహెచ్ఎంసి వేతనాలు అమలు చేయాలి

**తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి**



రాజేంద్ర నగర్, అక్టోబర్ 3/ జ్యోతి ప్రభంజనం :తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి రాష్ట్ర కోశాధికారి వి.హరినాథ్ రావు శనివారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ అండ్ శానిటేషన్ అడిషనల్ కమీషనర్ జి.వేణుగోపాల్ రెడ్డి గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. గ్రేటర్ హైదరాబాద్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు జిహెచ్ఎంసి వేతనాలు అమలు చేస్తున్నామని సర్కులర్ ని విడుదల చేయడం జరిగింది. సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో వీలినమైన మున్సిపల్ కార్మికులకు జిహెచ్ఎంసి వేతనాలు అమలు చేయాలని కోరడం జరిగింది. అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి కమిషనర్ తో మాట్లాడి తప్పకుండా ఈనెల వేతనాలు జిహెచ్ఎంసి అమలు చేస్తున్న సర్కులర్ ప్రకారం సిఎంసి పరిధిలో కూడా వేతనాలు అమలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు ప్రకాష్ పాల్గొనడం జరిగింది.

### వర్షాలు సమృద్ధిగా కురవాలని

# ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు

చౌటుప్పల్, అక్టోబర్ 03 చౌటుప్పల్ పట్టణంలో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ ముస్లిం సోదరులు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శనివారం





ఉదయం పట్టణంలోని ఈద్గా ప్రాంగణానికి ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో చేరుకుని సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, చెరువులు, కుంటలు, జలాశయాలు నీటితో నిండాలని ప్రార్థించారు. ముఖ్యంగా రైతులకు అనుకూల పరిస్థితులు ఏర్పడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని అల్లాహ్‌ను వేడుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిస్తే వ్యవసాయ రంగంతో పాటు ప్రజల జీవన పరిస్థితులు కూడా మెరుగుపడతాయని పేర్కొన్నారు. ప్రకృతి కరుణించి అందరికీ మేలు జరిగేలా తగిన వర్షపాతం నమోదుకావాలని ఆకాంక్షించారు.ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు పరస్పరం ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, యువకులు, చిన్నారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### నేల స్థితిమెరుగు పడుతుంది...

# నీటి నిలువ సామర్థ్యం పెరుగుతుంది

**మండల వ్యవసాయ అధికారి రామారావు**



గార్ల సేంద్రియ, జీవన ఎరువుల వినియోగం ద్వారా నేల భౌతిక స్థితి మెరుగుపడి, నీటి నిలువ సామర్థ్యం పెరిగి పర్యావరణానికి మేలు చేకూరుతుందని మండల ఏ,వో కావటి రామారావు పేర్కొన్నారు. శనివారం మండల పరిధి శేరిపురం గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఏటీఎంఏ) కార్యక్రమంలో ఏర్పాటుచేసిన జీవన ఎరువులు, జీవ నియంత్రణ పద్ధతుల అవలంబించి సాగు చేస్తున్న ప్రతి పంట క్షేత్ర ప్రదర్శన కార్యక్రమంలో ఆయన పాల్గొని అన్నదాతలకు జీవన ఎరువులు, జీవ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి నేలను పర్యావరణాన్ని సంరక్షించాలని ఆయన రైతులను కోరారు. రసాయన ఎరువులను విచక్షణ రహితంగా వాడవద్దు అన్నారు. రసాయన ఎరువులు మోతాదుకు మించి ఉపయోగించినట్లయితే నేల చౌడుబారి పంటలకు ప్రతికూలంగా మారుతుంది అన్నారు. ప్రత్తిలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో సూక్ష్మ పోషకాలు 19: 19: 19 కానీ 13, 0, 45 ను కానీ పిచికారి చేయాలని, రసం పీల్చే పురుగుల నివారణకు తియోమీతక్సం కానీ ఏసీ టమాప్రిడ్ ను కానీ సూక్ష్మ పోషకాలతో కలిపి పిచికారి చేయాలని రామారావు సూచించారు. యాజమాన్య పద్ధతులు సాంకేతిక సలహాల కోసం వ్యవసాయ అధికారులను రైతులు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఏ ఈ ఓ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### పార్లమెంట్ పరిధి కాంగ్రెస్‌లో

# 30 యేళ్ళ కష్టానికి గుర్తింపు ఇవ్వాలి

**త్వరలో నామినేటెడ్ కార్పొరేషన్ చైర్మన్ నియామకాలు**

**మహబూబాబాద్ కు రెండు పదవులపై ఆశలు - తెరపైకి ముగ్గురి పేర్లు**



గార్ల తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నామినేటెడ్ పదవుల భర్తీపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు ముమ్మరం చేసింది. మొదటి నుంచి పార్టీ జెండా మోసిన వారికి 80 శాతం కొత్తగా వచ్చిన వారికి 20 శాతం ప్రకారం పదవులు ఇవ్వాలని ప్రచారం జరుగుతున్నదిప్రచారం ప్రకారం వాస్తవంగా జరిగితే మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి రెండు స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ పదవులు వచ్చే అవకాశం కనపడుతున్నది. రేసులో ఉన్న ముగ్గురు: జన్నారెడ్డి భరత్ చంద్రారెడ్డి – 10 ఏళ్లు జిల్లా ప్రెసిడెంట్ గా పనిచేసిన సీనియర్ నేత.దనియాకుల రామారావు 30 ఏళ్లుగా పార్టీ మారకుండా పనిచేస్తున్న బీసీ నేత, గార్ల మండలంలో వార్డు మెంబర్ నుంచి మండల ప్రెసిడెంట్ వరకు పనిచేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించడంలో తన వంతు కృషి చేశారుబెల్లయ్య నాయక్ గిరిజన హక్కుల అధ్యక్షుడు, ఎస్టీ నేత. అనుభవం కలిగిన విషయ విశ్లేషకులుతెలంగాణ ఏర్పడినప్పటి నుండి బయ్యారం-ఇల్లందు నియోజకవర్గంలో 2014, 2018, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పెద్దల సమన్వయంతో మూడు పర్యాయములు ఇల్లందులో కాంగ్రెస్ ను గెలిపించడంలో బీసీ నాయకుడు గార్ల మండలానికి చెందిన ధనియాకుల రామారావు తనవంతుగా కీలకంగా పని చేశారు. 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తకు పదవులు కేటాయించినట్లయితే క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయగలరు. సుదీర్ఘ కాలంగా కష్టపడుతున్న కార్యకర్తలకు గుర్తింపు కల్పించాలని శ్రేణులు కోరుతున్నారు.

# జ్ఞానేష్ కుమార్ ని వెంటనే తొలగించాలి...

**సర్ ను నిలిపివేసి.. తొలగించిన ఓటర్ల హక్కును పునరుద్ధించాలి...**

**సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.డి పాషా**




చౌటుప్పల్ అక్టోబర్ మూడు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) వెంటనే పదవి నుండి తొలగించాలని, సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ )ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ఈ ప్రక్రియలో అన్యాయంగా ఓటర్ల జాబితా నుండి తొలగించిన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పునరుద్ధించాలని కోరారు. ఓటు హక్కు ప్రతి పౌరుడు రాజ్యాంగా హక్కు అని, అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగించకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ చౌటుప్పల మున్సిపల్ కార్యదర్శి గోషిక కరుణాకర్, ఉష్కాగుల శ్రీనివాస్, బత్తుల దాసు, ఆకుల ధర్మయ్య, బొడ్డు అంజిరెడ్డి, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, తూర్పునూరి మల్లేష్, ఆర్టీవో పాషా, బొడ్డు రాజు, భావనలపల్లి స్వామి, ఎండి ఖయ్యూం, బొమ్మ కంటి కృష్ణ,పాల్గొనడం జరిగింది.

# చెన్నై షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

**:దసరా, దీపావళి సందర్భంగా ప్రజలు సదవకాశాన్ని వినియోగించుకోవాలి.**

**:వ్యాపార రంగంలో అంచెలంచెలుగా ఎదగాలని ఆకాంక్ష.**




కోదాడ, అక్టోబర్ 03 కోదాడలో నూతనంగా ఏర్పాటు చేసిన 37వ చెన్నై షాపింగ్ మాల్‌ను కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెన్నై షాపింగ్ మాల్ యాజమాన్యం వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధిస్తూ అంచెలంచెలుగా ఎదగాలని ఆకాంక్షించారు. దసరా, దీపావళి పండుగల సందర్భంగా ప్రజలు షాపింగ్ మాల్‌లో అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సేల్స్ కౌంటర్‌ను ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రారంభించగా, తొలి కొనుగోలును కౌన్సిలర్ కొల్లా కోటిరెడ్డి చేశారు. ప్రారంభోత్సవం సందర్భంగా వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిని ఆశీర్వదించారు. అనంతరం చెన్నై షాపింగ్ మాల్ నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ బాబు, వైస్ చైర్మన్ మల్లీశ్వరి, మున్సిపల్ కమిషనర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# బైక్‌పై నుంచి జారిపడి యువకుడి మృతి



చౌటుప్పల్, అక్టోబర్ 3 హైదరాబాద్ నుంచి కాకినాడకు వెళ్తున్న ఓ యువకుడు బైక్‌పై నుంచి జారిపడి గుర్తుతెలియని వాహనం కింద పడి మృతిచెందిన ఘటన చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన కుంచె లారెన్స్ (26) ప్రైవేట్ ఉద్యోగం నిమిత్తం రెండు నెలల క్రితం హైదరాబాద్‌కు వచ్చి ఎర్రగడ్డలోని ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. అక్టోబర్ 2న తనతో పాటు హాస్టల్‌లో ఉంటున్న శివప్రసాద్‌తో కలిసి పల్సర్ బైక్ ( ఏపీ40 ఎల్ వి 8524)పై హైదరాబాద్ నుంచి కాకినాడకు బయలుదేరాడు. బైక్‌ను శివప్రసాద్ నడుపుతుండగా లారెన్స్ వెనుక కూర్చున్నాడు.పంతంగి టోల్‌గేట్ వద్దకు చేరుకున్న సమయంలో తనకు నిద్ర వస్తోందని లారెన్స్ శివప్రసాద్‌కు చెప్పడంతో వారు తిరిగి హైదరాబాద్ వైపు బయలుదేరారు. ఈ క్రమంలో తెల్లవారుజామున సుమారు 4:45 గంటల సమయంలో ఆందోల్ మైసమ్మ గుడి సమీపంలో లారెన్స్ నిద్రలో ఉండి బైక్‌పై నుంచి కిందపడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం అతనిపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చీకోటి సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ ఘటనపై చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జీ. మన్మథ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501**, PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**